

ఆమనగల్లులో దీపాలతో చిన్నారులు



కందుకూరులో టపాసులు కాలుస్తున్న యువకులు

ఇంటింటా వెలుగుల కేళి



జిల్లావ్యాప్తంగా దీపావళి పండుగను సంబురంగా జరుపుకున్నారు. వేడుకల్లో చిన్నాపెద్ద సందడి చేశారు. తమ జీవితాలలో కష్టాల చీకట్లు తొలగి.. సంతోషాల వెలుగులు నిండాలని వేడుకుంటూ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. నోములు, వ్రతాలు ఆచరించారు. ఇంటింటా దీపాలు వెలిగించి ఆనందోత్సాహాలతో బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. పండగ నేపథ్యంలో వాడవాడలా పిండి వంటలు గుమగుమలాడాయి. పలు ప్రాంతాల్లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నరకాసుర విగ్రహాన్ని దహన కార్యక్రమం నిర్వహించారు.



తలకొండపల్లిలో నరకాసుర కటౌట్ దహన కార్యక్రమం



7న కలెక్టరేట్‌లో బహిరంగ

విచారణ

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 7వ తేదీన కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంచార జాతుల కుల పెద్దలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులపెద్దలు, కమిషన్ ఇచ్చే నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లతో తెలుగు/ఇంగ్లీష భాషలో బహిరంగ విచారణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

కల్తీమయం!

జిల్లావ్యాప్తంగా కల్తీ ఆహార పదార్థాల విక్రయం

కల్తీకి కాదేది అనర్హం.. అన్నట్టుంది ప్రస్తుత పరిస్థితి. బయట కొనే ఏ వస్తువైనా మంచిదేదో.. నకిలీ ఏదో పోల్చుకోలేని దుస్థితి. ప్రజలు బయట పదార్థాలు కొని ఇంటికి అనారోగ్యాన్ని తెచ్చుకుంటున్నారు. ఆ తీరుగా వ్యాపారులు హోటళ్లు, రెస్టారెంట్‌లతో పాటు నిత్యావసర సరుకులు కల్తీ చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నారు. నీటి నుంచి చిన్న పిల్లలు తాగే పాల వరకు సర్వం కల్తీమయం అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు.



ఆదిభట్లలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్(ఫైల్)



ఓ హోటల్ కిచెన్‌లోని పదార్థాలు

- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారుల నిఘా కరువు
- బిర్యానీల్లో ప్రమాదకర సింథటిక్ కలర్ల వినియోగం
- నెయ్యిలో డాల్డా, అల్లం వెల్లుల్లిలో ఆలుగడ్డ మిక్సింగ్
- సిబ్బంది కొరతతో పది నెలల్లో 70 నమూనాలే సేకరణ
- 17 శాంపిల్స్ అన్‌సేఫ్‌గా నిర్ధారణ, కేసులు నమోదు
- అరకొర జరిమానాలు, యథావిధిగా జరుగుతున్న కల్తీ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల నుంచి అనుమతి తీసుకున్న హోటళ్లు, రెస్టారెంట్లు రెండు వేలకు పైగా ఉన్నాయి. చిరుతిళ్లు అమ్మే తోపుడు బండ్లు, ట్రక్‌లు, పానీపూరి డబ్బాలు, న్యూడుల్స్ కేంద్రాలు మరో వెయ్యికిపైగా ఉన్నాయి. వైన్‌షాపులు, ప్రైవేటు హాస్టళ్లు, ఐస్‌క్రీం పార్లర్లు, పాల డెయిరీలు, బేకరీలు ఎన్నో ఉన్నాయి. పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలు, ఆసుపత్రుల్లో క్యాంటీన్లు కూడా ఉన్నాయి. ఇవి కాకుండా మసాల, అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఫుడ్‌సేఫ్టీ

మిగతా 8వ పేజీలో...

శంషాబాద్ ఎయిర్‌పోర్టు

సూచిక బోర్డులో మార్పులు

- విమానాల రాకపోకల సమాచారం హిందీలోనూ డిస్‌ప్లే

శంషాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకల సమాచారం సూచిక బోర్డులో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు మార్పులు చేశారు. గతంలో తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనే సమాచారం డిస్‌ప్లే అయ్యేది. ఇటీవల ఆ బోర్డులో హిందీ భాషను సైతం చేర్చారు. దేశంలో అత్యధికంగా హిందీ మాట్లాడేవారు ఉండటంతో ఈ సౌలభ్యం కల్పించినట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.



ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన హిందీ సూచిక బోర్డు

షాద్‌నగర్ టూ అరుణాచలం

ఆర్టీసీ ప్రత్యేక బస్సు



షాద్‌నగర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని అరుణాచలానికి షాద్‌నగర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిపో మేనేజర్ పేర్కొన్నారు. అరుణాచలానికి ఈ నెల 13వ తేదీ రాత్రి 7గంటలకు షాద్‌నగర్ డిపో నుంచి బస్సు బయల్దేరి మధ్యలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చేరుకుని అక్కడి దేవాలయాల్లో దర్శనాల అనంతరం అదే రోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటుంది. అక్కడ గిరి ప్రదక్షిణాల అనంతరం 15వ తేదీ సాయంత్రం 4గంటలకు అరుణాచలం నుంచి బయల్దేరి 16వ తేదీ ఉదయం 5గంటలకు షాద్‌నగర్‌కు చేరుకుంటుంది. అరుణాచలం వెళ్లాలనుకునే భక్తులు సెల్ నెంబర్లు 9490021433, 9182645281, 9959226287లో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.



సంతా.. మా ఊరి సంత

జాతరలా సర్దార్‌నగర్ అంగడి

- జిల్లాలోనే ఇది పెద్ద పశువుల సంత
- నిత్యావసరాలతో పాటు, దుస్తులు, పనిముట్లు లభ్యం
- పక్క జిల్లాల నుంచి కూడా రాక

7

ఆధునిక పోకడలతో దూసుకెళ్తున్న నేటి కాలంలో సూపర్ మార్కెట్లకు ఆదరణ పెరుగుతోంది. జనాభా ఎక్కువ ఉన్న పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిలో మార్కెట్లు వెలుస్తున్నాయి. అయినా పల్లెల్లో అలనాటి అంగళ్లకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట సంత జరుగుతూనే ఉంటుంది. ఒకప్పుడు అంగట్లో కూరగాయలు, పశువులు, దుస్తులు మాత్రమే కనిపించేవి. నేడు ఆధునిక పోకడలకు సంబంధించిన సామగ్రి సైతం దర్శనమిస్తున్నాయి. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ సంతపై ప్రత్యేక కథనం.



రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- వర్షానికి చిత్తడిగా రోడ్డు
- అదుపుతప్పి పడిపోతున్న ద్విచక్ర వాహనదారులు
- అధ్వానంగా బోడంపహాడ్, మన్‌మర్రి గ్రామాల దారి

8



కీసరగుట్టకు కార్తీక శోభ

కార్తీక మాసోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు
- దర్శనానికి ఐదు రకాల లైన్ల ఏర్పాటు
- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తజనం
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ నిర్వాహకులు



కీసర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి కీసరగుట్టలో కార్తీక శోభ సంతరించుకొనుంది. హిందువులు పవిత్రంగా భావించే కార్తీక మాసోత్సవం పురస్కరించుకొని సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన కేసరిగిరి క్షేత్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలోని మూలవిరాట్ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయన్నారు. వేలాదిగా తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా

మిగతా 7వ పేజీలో...

వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్



చేవెళ్లలో మాట్లాడుతున్న బాలమల్లేష్

చేవెళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు అందిస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల అంబేద్కర్ భవనంలో జిల్లా అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారం, మార్గాలు అనే అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై బాలమల్లేష్ మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ఎత్తివేయాలని కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కలకొండా కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలకుమాకుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభులింగం, రైతుకూలీ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, సత్తిరెడ్డి, సుధీర్, వడ్ల మంజుల, స్వరూప, మగ్బుల్, మధు, రఘురాం ఉన్నారు.



ఇందిర, పటేల్ సేవలు చిరస్మరణీయం

- మహనీయుల అడుగుజాడల్లో యువత నడుచుకోవాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

8

గెలుపోటములు సహజం

యాచారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. యాచారం మండలం మాల్‌లో ఎంపీఎల్ క్రికెట్ పోటీలో విజేతలకు ఆయన ట్రోఫీ అందించి మాట్లాడారు. యువకులు గ్రామాభివృద్ధికి పాటుపడాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలు సాధించేందుకు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌కుమార్, ఎస్సై సత్యనారాయణ, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టుశ్రీనివాస్, వెంకటేష్, బాలకృష్ణ, ఈశ్వర్, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా తిరునక్షత్ర మహోత్సవం



పురస్కారాన్ని అందిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి తిరునక్షత్ర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చిన జీయర్ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో తీర్థగోష్ఠి, ఆరాధనతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ పురస్కారాన్ని శ్రీమాన్ ఖగేంద్రాచార్య సువేది శుక్లకు అందించారు. కార్యక్రమంలో మైహోమ్స్ గ్రూప్స్ ఛైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పాల బిల్లులు ఇవ్వాలని నిలదీత

- మదర్ డెయిరీ మేనేజర్‌పై పాడి రైతుల ఆగ్రహం
- దాణా రేటుపై మండిపాటు
- పాల ధర పెంచాలని డిమాండ్

7

మైసిగండి ఆలయాన్ని తీర్చి దిద్దుతాం

కడ్తాల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయాన్ని పర్యాటకంగా, దర్శనీయ స్థలంగా తీర్చి దిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మైసమ్మ ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో పూజలు నిర్వహించారు. ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్ ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మైసమ్మ ఆలయాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, శేఖర్‌గౌడ్, జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీరామ్, సురేందర్‌రెడ్డి, అరుణ్, తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్: మైసిగండి పురేనగిరి గుట్టపై దత్తాత్రేయస్వామి, శివాలయ నిర్మాణానికి భూమి పూజచేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ మాదారం శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో యాట నర్సింహ, భగవాన్ ఫౌండేషన్ ఛైర్మన్ దూద్యానాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి, రవి, రూప్‌సింగ్, తారాసింగ్, సుబ్బు, శంకర్, రాజా, శ్రీను, కిషన్, పూజారి బిచ్యా, బిక్కు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



మైసిగండిలో ఎమ్మెల్యే కసిరెడ్డి పూజలు

క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మీవెంట నేనున్నానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాడీ బిల్డర్ నితిన్‌కుమార్‌గౌడ్‌కు హామీ ఇచ్చారు. కరన్‌కోట్ గ్రామానికి చెందిన నితిన్‌కుమార్‌గౌడ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాడు. జనవరిలో జరిగే జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధమవుతున్న నితిన్‌కు రూ.20వేలఆర్థిక సహాయాన్ని అందజేశారు.విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లొంక నర్సింహులు ఉన్నారు.

షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

దోమ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని బొంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలపై జరుగుతున్న దాడులు, బాల్య వివాహాలు, బ్యాంకింగ్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేదం, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పోలీసు కళాజాత బృందం ఇంచార్జ్ అశోక్, ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు మనీషా, శోభారాణిపాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

కొడంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని యాచారం సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి గున్‌గల్‌లో జీఎంపీఎల్ క్రికెట్ పోటీలో విజేత జట్టుకు ట్రోఫీ అందించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి పేరు తేవాలన్నారు. జిల్లాలో గున్‌గల్‌కు పేరు ప్రఖ్యాతులున్నాయని, గ్రామం నుంచి ఉన్నతోద్యోగాల్లో ఉండి గ్రామానికి మంచి పేరు తెస్తున్న విషయాన్ని మనం గమనించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, భీమ్‌యాదవ్, రవి ఉన్నారు.

రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు



మంచాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.నీలమ్మ అన్నారు. సీపీఐ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ సదస్సు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మంచాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి శివరాల లక్ష్మయ్య, నాయకులు నర్ల శ్రీశైలం, విజయ్‌కుమార్, అంబోత్‌రాజు, గాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

షాద్‌నగర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ఆర్ సరిత శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే మట్లాడుతూ రెవెన్యూ పరంగా రైతులకు సేవలందేలా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కృషిచేస్తానని ఆర్డీవో చెప్పారు.



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న ఆర్డీవో

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

షాద్‌నగర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాశ్ నాయక్ గురువారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్య, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, దీంతో 13లక్షల మంది విద్యకు దూరం అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కళాకారిణికి ఎమ్మెల్యే అభినందన



రాజ్ఞికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలైన కూచిపూడి నృత్యం, జానపదం, నాటకాల్లో ప్రతిభ కనబరుస్తున్న బాలిక రాజ్ఞిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. షాద్‌నగర్ శివమారుతి గీతా అయ్యప్ప ఆలయ అర్చకుడు రవిశర్మ-మాధురిల కుమార్తె రాజ్ఞి చదువుకుంటూనే కళల్లో రాణిస్తోంది. సంస్కార భారతి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంకర్‌ను కలిశారు. ఎమ్మెల్యే రాజ్ఞిని అభినందించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యులు కె.రంగనాథం, టీవీ రంగయ్య, జి.రంగారెడ్డి, రమేష్‌చారి, సాయికృష్ణ, ప్రవీణ్, మాధురి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



టీటీడీ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా నియామకమైన బీఆర్ నాయుడి(టీటీడీ చైర్మన్)ని శుక్రవారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని, అలాగే టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హైదరాబాద్‌లో నాయుడిని ఎమ్మెల్యే కలిశారు. స్వామి వారి దర్శనానికి ఎమ్మెల్యేలు, ఎంపీల రికమండేషన్ లెటర్లను అమోదించాలని నాయుడుని కోరానని ఎమ్మెల్యే తెలిపారు.

కుల గణనకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలి



మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతల తొలగింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపెట్టిన కుల గణన సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు అధికారులకు సహకరించాలని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న కుల గణన 30నాటికి పూర్తి చేసి రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి ఫలాలు పేదలకు అందేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లు అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమన్నారు. సర్వేకు గ్రామాలకొచ్చే అధికారులకు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించే బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయించండి



కోదండరెడ్డికి వినతిపత్రమిస్తున్న మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి

యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మండలంలో ఫార్మాసిటీని రద్దుచేయించాలని గురువారం రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డికి కుర్మిద్ద మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, రైతులు వినతిపత్రమందజేశారు. ఫార్మాసిటీకి ఇంకా భూములుకావాలని అధికారులు నోటీసులు ఇవ్వకుడా చొరవ తీసుకోవాలని కోరారు. ధరణిలో నిషేధిత జాబితాలో ఉన్న భూములపై ఆంక్షలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బి.శ్రీనివాస్, వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ ఎదగాలి



మంత్రి సీతక్కను కలిసిన భీంభరత్, గౌరీసతీష్

మొయినాబాద్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఎదగాలని, అందుకు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోని మంత్రి కార్యాలయంలో సీతక్కను చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ కలిశారు. చేవెళ్లలో పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌత్‌సతీష్, మండల అధ్యక్షుడు మానెయ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి ఉన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఏఐటీయూ జెండా ఎగరవేస్తున్న నాయకులు

శంషాబాద్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని అంబేడ్కర్‌చౌరస్తాలో గురువారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ 105వ వార్షికోత్సవాల్లో భాగంగా యూనియన్ జెండాను జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఎగరవేశారు. కార్మికులు హక్కుల కోసం కలసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిరి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీకి పునర్వైభవాన్ని తెద్దాం



మొయినాబాద్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పునర్వైభవాన్ని తీసుకొద్దామని, కార్యకర్తలు కష్టపడి పార్టీ సభ్యత్వ నమోదును చేయించాలని టీడీపీ చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ కాట వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం మొయినాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు యాదయ్యగౌడ్ అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు టీడీపీ తోడుగా ఉంటుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాఘవులు, మానిక్యం, దామోదర్‌రావు, ప్రవీన్‌కుమార్, మల్లికార్జున్, సత్యనారాయణ, అమీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీన్‌గౌడ్ పాల్గొన్నారు.





సంతలో అమ్మడానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ పనిముట్లు

సంతా..

మా ఊరి సంత

జాతరలా సర్దార్‌నగర్ అంగడి

- జిల్లాలోనే ఇది పెద్ద పశువుల సంత
- నిత్యావసరాలతో పాటు, దుస్తులు, పనిముట్లు లభ్యం
- పక్క జిల్లాల నుంచి కూడా రాక

షాబాద్, సెప్టెంబర్ 18: షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో ప్రతీ మంగళవారం సంత జరుగుతుంది. ఇక్కడ పశువుల సంత రంగారెడ్డి జిల్లాలోనే అతి పెద్దది. ఈ సంతకు తలమానికం పశువుల అంగడి. అందులో ముఖ్యంగాఎద్దులు, గేదెలు, మేకల క్రయవిక్రయాలు అధికంగా జరుగుతాయి. రైతులు ఎంత ఆధునిక వ్యవసాయం చేస్తున్నా ఇంకా ఎద్దులపై మోజు తగ్గడం లేదు. పాల కోసం గేదెలు, ఆవులను కొనుగోలు చేసేందుకు చాలా మంది సంతకు వస్తుంటారు. ఫలితంగా సంతలో పశువులకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. పక్క జిల్లాలైన మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి ఇక్కడికి అధిక సంఖ్యలో రైతులు వస్తుంటారు.

రంగురంగుల దుస్తులు...

పల్లె ప్రాంతాల జనాలు ఎక్కువగా సంతలో దుస్తులు కొనడానికి ఇష్టపడతారు. ఇందుకు కారణం కారు చౌకగా లభించడమే. సాధారణంగా దుకాణాల్లో దొరికే వాటికంటే పదుల రెట్లు తక్కువ ధరకు ఇక్కడ లభిస్తాయి. అందుకే ప్రత్యేకంగా జనం సంత రోజున దుస్తులు కొనడానికి వస్తారు. అంతే కాదండి ఇక్కడ ప్రత్యేకంగా నేసిన గొంగళ్లు కూడా లభిస్తాయి. గొంగళ్లను కొనేందుకు యాదవలు అధికంగా ఇష్టపడతారు.

చౌక ధరలకు కూరగాయలు

పప్పులు, ధాన్యాలు కిరాణ దుకాణాల్లో కొంటే ధరలు అధికంగా ఉంటాయి. అందుకే నిరుపేద, మధ్యతరగతి



అమ్మడానికి సిద్ధంగా ఉన్న గొంగళ్లు

కుటుంబాల వారంత సంతలో సరుకులు కొనడానికి ఇష్టపడతారు. అందుకు అనుగుణంగా సంతలో వివిధ రకాల పప్పులు, ధాన్యాలు విక్రయిస్తున్నారు. అదే విధంగా రైతులు పండించిన కూరగాయలు కూడా ఇక్కడ విక్రయిస్తుంటారు. ఇక్కడ వినియోగదారులకు కూరగాయలు అతి చౌకగా దొరుకుతాయి. దీంతో సంతలో కూరగాయలకు మంచి గిరాకి ఉంది.

రైతులకు అవసరమైన అన్ని పనిముట్లు

సంతలో రైతులకు వ్యవసాయానికి కావల్సిన పనిముట్లు అన్ని ఇక్కడ దొరుకుతాయి. సంతలో మార్కెట్ ధరకన్న తక్కువ రేట్లలో పనిముట్లు దొరుకుతాయి. అందుకే రైతులు సంతలో కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంటి సామగ్రి తీసుకోవడానికి ఇష్టపడుతారు. ఇంట్లోకి కావలసిన సామాన్లు సైతం చౌక ధరకే దొరుకుతున్నాయి. ఇక్కడ ప్రజలకు ప్రతి వారం అందుబాటులో ఉంటాయి.



శుభ్రం చేయించిన కుర్మిద్ద క్రీడాప్రాంగణం

క్రీడాప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు

యాచారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం కుర్మిద్దలోని క్రీడా ప్రాంగణంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని గత నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వెంచర్ నిర్వాహకులు స్పందించారు. ప్రాంగణంలో పెరిగిన గడ్డిని డోజర్‌తో తొలగించారు. పంచాయతీ సిబ్బంది దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వెంచర్ నిర్వాహకులే చొరవ చూపి క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు.

నన్నూరి నర్సిరెడ్డికి ఘన సన్మానం



నన్నూరి నర్సిరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న టీడీపీనాయకులు

ఘట్‌కేసర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సీనియర్ నాయకులు నన్నూరి నర్సిరెడ్డికి తెలంగాణ నుంచి టీటీడీపాలకమండలి సభ్యులుగా నియమితులైనందున శుక్రవారం మేడ్చల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ కోఆర్డినేటర్ సుంకరి వెంకటేష్ ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రంనుండి టీటీడీ బోర్డు సభ్యులుగా ఎన్నికకావడం అభినందనీయమన్నారు. పార్టీకి ఎన్నో విధాలుగా సేవలందించిన నన్నూరి నర్సిరెడ్డికి టీటీడీ పాలకమండలిలో స్థానం కల్పించడంపైపార్టీ అధినేతచంద్రబాబు నాయడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, సామల జగన్‌మోహన్‌రెడ్డి, మహేష్ తదితరులుపాల్గొన్నారు.

కీసరగుట్టకు కార్తీక శోభ

(5వ పేజీ తరువాయి)

శని, ఆది, సోమవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యల్లో వచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు, పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఐదు రకాల క్యూలైన్ల ఏర్పాటు

కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకునేందుకు ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనం, రుద్రాభిషేకం(అభిషేకాలు) అనే ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రముఖులు విచ్చేసిన సమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా భక్తుల రద్దీ దృష్ట్యా క్షేత్రానికి వచ్చే రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు నియంత్రించేందుకు పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

భక్తులు సహకరించాలి

ఈ నెల రోజుల పాటు మామూలు రోజుల్లో దాదాపు 50 నుంచి 60 మంది సిబ్బందితో విధులు నిర్వహించనున్నారు, శని, ఆది, సోమవారాల్లో, ప్రత్యేక పర్వదినం సందర్భాల్లో ఆ సిబ్బందిని 100కు పెంచే అవకాశం ఉందని సీఐ వెంకటయ్య తెలిపారు. వాహనాలను కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలని, ఇష్టానుసారంగా క్షేత్రంపైకి తీసుకురావద్దని, పోలీస్ అధికారుల విధులకు ఆటంకం కలిగిచకుండా భక్తులు సహకరించాలని వెంకటయ్య సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదాల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం వర్మ, ఈవో సుధాకర్ తెలిపారు.

మొదటి రోజు రుద్రాభిషేకం

మొదటి రోజు శనివారం స్వామివారికి శ్రీ మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆదివారం ఆకాశ దీపోత్సవం ప్రారంభించి, క్షీరాభిషేకం జరిపిస్తారు. మూడో రోజు సోమవారం నానా విధ ఫల రసాభిషేకం నిర్వహిస్తారు. నాలుగో రోజు(5వతేదీ) నాగుల చవితి సందర్భంగా నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇలా ఒక్కోరోజు ఒక ప్రత్యేకమైన పూజలు నిర్వహించనున్నారు. డిసెంబరు 1వ తేదీ(ఆదివారం) కార్తీక అమావాస్య సందర్భంగా తైలాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించడంతో కార్తీక మాసం పరిసమాప్తం అవుతుంది.



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ పండిత్

కార్మిక చట్టాలను తొలగిస్తే ఊరుకోం

తాండూరు, నవంబరు 1: కార్మికుల వేతనాలు చెల్లింపు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలన్న ఆదేశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పర్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ పండిత్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకొని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను తొలగించి, 4కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని కార్మికులు తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేసే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు భూపతి, గోపాల్, తదితరులు ఉన్నారు.

సీలింగ్ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పరిగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మిట్టకోడూరు గ్రామంలో ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమంచుకున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ, సీపీఐ, బీకేఎంయూల ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ, మిట్టకోడూరులో ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎనిమిది మంది కబ్జాలో ఉన్నారని, ఐదుగురి వ్యక్తులపై అధికారులు కేసులు పెట్టించారని, మిగతా ముగ్గురిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. చట్ట ప్రకారం కబ్జాలో ఉన్నవారందరిపై కేసు పెట్టాలే, కానీ కొందరిపై పెట్టి కొందరిని వదిలివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు పరిగి యాదయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

తాండూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, భవిష్యత్తులో ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలంటే సేంద్రియ ఎరువులతో పండించిన వాటిని తినాలని ఏకలవ్య ఫౌండేసన్ సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ పేర్కొన్నారు తాండూరులోని గురుకుల బాలికల పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన కాంపిటేషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మార్కులు కాదు సమాజంలో మార్పు వచ్చే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కేవీఎం వెంకట్, ప్రిన్సిలప్ ప్రవీణారెడ్డి కోఆర్డినేటర్ తుల్జప్ప, రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



కీసర, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో ప్రభుత్వ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఎయిడ్స్, క్షయ వ్యాధి, టీబీ వ్యాధుల పట్ల కోఆర్డినేటర్ రాంరెడ్డి అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని మనలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే వేరే వాళ్లు దగినా, తుమ్మిన వెంటనే మనకి వ్యాధిసోకే అవకాశం ఉంటుందని, జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భవానీ, రాణి పాల్గొన్నారు.

బిల్లుల కోసం డెయిరీ మేనేజర్ నిలదీత



యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి బిల్లులివ్వకపోగా దాణా ధర పెంచుతున్నారని కుర్మిద్దలో గురువారం మాల్ మదర్ డెయిరీ మేనేజర్ వెంకటయ్యను పాడి రైతులు నిలదీశారు. డెయిరీకి పాలుపోయాలంటూ మరోసారి గ్రామానికి రావొద్దన్నారు. దాణాధర పెంపు యాజమాన్య నిర్ణయమేనని మేనేజర్ సముదాయించే ప్రయత్నం చేశారు. ఆవుపాలు లీటర్‌కు రూ.31, గేదెపాలు రూ.38 మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోయారు. ఆవుపాలు రూ.38కి, గేదెపాలు రూ.45 పెంచాలని డిమాండ్ చేశారు. విజయడైరీ పాడి రైతులను కాపాడుకుంటోందని, ఆ డెయిరీ ఇస్తున్న రేటునే మదర్ డెయిరీ కూడా ఇవ్వాలని, లేదంటే మదర్ డెయిరీకి పాలుపోయం అని రైతులు తేల్చి చెప్పారు. తాను రైతులకు రూ.2లక్షల డబ్బు అందజేసి ఆదుకున్నానని మదర్ డెయిరీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

పింఛన్ పెంపు కోసం 16న కలెక్టరేట్ వద్ద దీక్ష

తలకొండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం వివక్ష వీడాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు/వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ. 6వేల పింఛనివ్వాలని డిమాండ్ చేశారు. తలకొండపల్లిలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) సమావేశాన్ని నిర్వహించారు. దివ్యాంగుల సమస్యలు, ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన, 20న ఇబ్రహీంపట్నంలో నిర్వహించే వికలాంగుల హక్కుల పోరాట సమితిసభ విజయవంతంపై చర్చించారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు తరలిరావాలన్నారు.

విద్యార్థి మృతి.. మూడో రోజు స్కూల్‌కు సెలవు!

- ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

బషీరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థి చనిపోతే మూడు రోజు పాఠశాలకు స్థానిక సెలవు ప్రకటించడమేమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. బషీరాబాద్ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి రాంచరణ్ రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా, దీపావళి పండగ తర్వాత శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థి మృతి పట్ల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్‌ఎం నిర్ణయం తీసుకుని మూడోరోజు శుక్రవారం సెలవు ప్రకటించారు. ఈ నిర్ణయంపై పలువురు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పలువురు ఉపాధ్యాయులు జీహెచ్‌ఎం తీరును తప్పుబడుతూ విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయినా పాఠశాల సమయం ముగిసేవరకు స్కూళ్లోనే ఉండటం గమనార్హం. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు జీహెచ్ఎను అడిగితే నా ఇష్టం, మీరెవరూ అడగడానికంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడడని స్థానికుడు రవిగౌడ్ ఆరోపించారు. కాగా, జీహెచ్‌ఎం జగదీశ్వర్‌ను వివరణ కోరగా విద్యార్థి మృతికి సంతాప సూచకంగా, స్థానిక ఉపాధ్యాయుల సమష్టి నిర్ణయంతోనే జిల్లా విద్యాధికారికి సెలవు ప్రకటిస్తున్నట్లు ముందురోజే మెస్సేజ్ చేశానన్నారు. దీన్ని కొందరు ఉపాధ్యాయులు రాజకీయం చేయడం తగదన్నారు.

మండల సాధనకు గట్టిప్పలపల్లి వాసుల పోరుబాట



తలకొండపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాన్ని ప్ర భుత్వం మండలం చేయాలని గట్టిప్పలపల్లి వాసులు పోరుబాటపట్టారు. జేఏసీగా ఏర్పడి శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలో అశోక్‌గౌడ్, రాజేందర్, శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, అనిల్, యాదగిరి, కృష్ణాజీ, చెన్నయ్య ప్రణయ్‌కుమార్ కూర్చున్నారు. వెంకట్రావ్‌పేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్లులపల్లితండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీతండాలతో కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని డిమాండ్ చేశారు. 2022, 2023లలోనూ దీక్షలు చేశామన్నారు. తమ ప్రాంతానికి చెందిన వ్యక్తే సీఎంగా ఉన్న నేపథ్యంలో గట్టిప్పలపల్లిని మండలం చేయాలని నాయకులు కోరారు.

పరిగి ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం



వికారాబాద్ ఆస్పత్రిలో తల్లీబిడ్డ

పరిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డెలివరీ కోసం పురుటి నొప్పులతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణి పట్ల డాక్టర్లు, సిబ్బంది ప్రదర్శించిన తీరుతో నరకాన్ని చూసింది. పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివయ్య కూతురు హేమలత నిండు గర్భిణి. గురువారం తెల్లవారుజామున పురుటి నొప్పులతో పరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. నొప్పులతో అవస్థలు పడుతుంటే డ్యూటీ డాక్టర్ సిబ్బంది కనీసం చూడకుండానే ఇక్కడ డెలివరీ కాదు, ఇక్కడి నుంచి తీసుకెళ్లండని ఉచిత సలహా ఇచ్చారు. తాము పేదవాళ్ల నగరానికి వెళ్లలేం.. చూడండని ఆమె తండి శివయ్య బతిమిలాడినా వారు వినిపించుకోలేదు. దాంతో తప్పని పరిస్థితుల్లో పురుటి నొప్పులతో బాధ పడుతున్న హేమలను ఓ ప్రైవేట్ వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ అస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స ప్రారంభించక ముందే నార్మల్ డెలివరీ కాగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. పరిగి అస్పత్రిలో డాక్టర్, సిబ్బంది ప్రదర్శించిన తీరు దుర్మార్గమని శివయ్య తెలిపారు. కనీసం రెస్పాన్స్ ఇవ్వలేదని, ఇలాంటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అయన కోరుతున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

● మరమ్మతులు చేయాలని గ్రామస్తుల డిమాండ్



బురదమయంగా బోడంపహాడ్, మన్‌మర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డు

షాబాద్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధి బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. అంతారం గేటు నుంచి అప్పారెడ్డిగూడ వరకు ఉన్న 8 కిల్లోమీటర్ల మేర ఉన్న ఈ బీటీ రోడ్డు వెంట కేబుల్ వేయడానికి రోడ్డు పక్కన కాలువ తవ్వుతున్నారు. వెంటవెంటనే కేబుల్ వేస్తున్నారు. రోడ్డుపై మట్టిపోస్తున్నారు. గురువారం వర్షం పడటంతో రోడ్డంతా బురదమయమైంది. ఈ రోడ్డుపై వాహనాలు నడిపితే స్కిడ్ అవుతున్నారు. ద్విచక్ర వాహనలదారులు బ్యాలెన్స్ తప్పి పడిపోతున్నారు. ఇప్పటికే కొందరు బైక్ రైడర్లు పడిపోయి గాయాలపాలయ్యారు. రాత్రి వేళలో అయితే ఈ రోడ్డుపై వాహనదారులు రావడం లేదు. ఎక్కడే మట్టిబెడ్డలున్నాయో తెలియక వాటిపై నుంచి వాహనాలు వెళ్తే స్కిడ్ అయి పడిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

టీటీడీలో అవకాశం పూర్వజన్మ సుకృతం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో నన్నూరి నర్సిరెడ్డికి అవకాశం లభించడం పూర్వ జన్మ సుకృతమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు.టీటీడీ సభ్యుడిగా నియమితుడైన నర్సిరెడ్డి గురువారం నర్సింహులును షాద్‌నగర్‌లో కలిశారు. నర్సిరెడ్డిని నాయకులు అభినందించారు. భక్తుల మన్ననలు పొందేలా పనిచేస్తూ మంచి పేరుతేవాలని బక్కని సూచించారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.



నన్నూరి నర్సిరెడ్డిని అభినందిస్తున్న బక్కని నర్సింహులు ←

ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపిన నాయకుడు



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రత్నంలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ జిల్లా నాయకుడు వైభవ్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నంలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణమోల్ల త్రినేత్ర, ఆనంద్‌గౌడ్, జయసింహారెడ్డి, శ్రీతంరెడ్డి, సందీప్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

చెట్టుపై విద్యుదాఘాతం.. వ్యక్తి మృతి



శివశంకర్ మృతదేహాన్ని తీస్తున్న స్థానికులు

మొయినాబాద్ నవంబరు1(ఆంధ్రజ్యోతి): మర్రి ఆకుల కోసం చెట్టు ఎక్కిన ఓ వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందిన సంఘటన కనకమామిడిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌కు చెందిన శివశంకర్(45) కుటుంబం 15ఏళ్ల క్రితం కనకమామిడికి వలసొచ్చింది. అతడు కనకమామిడిలోని ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మర్రి ఆకుల కోసం ఆయాన్ కాలేజీ ఎదురుగా హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పక్కనున్న చెట్టు ఎక్కాడు. ఆకులు తెంపుతుండగా చెట్టు మధ్యలో ఉన్న విద్యుత్ వైర్‌కు తగలడంతో షాక్ కొట్టి చెట్టుపైనే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని మృతదేహాన్ని కిందికి దింపారు. పోస్టుమార్టం కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివశంకర్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధి చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. 65 నుంచి 75సంవత్సరాల వయసు కలిగిన మహిళ శుక్రవారం సాయంత్రం 4:30గంటల సమయంలో గేటు వేసి ఉన్నపుడు గేట్ పక్క నుంచి పట్టాలు దాటుతుండగా సంపర్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని మృతిచెందింది. మృతురాలు గ్రీన్ కలర్ చీర, బ్లాక్ కలర్ జాకెట్, బ్యాగులో ప్లేట్ ఉందని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 9849090426 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు...

షాద్‌నగర్ రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో ఉన్న వేంకటేశ్వర హ్యాచరీస్‌లో కరెంట్‌షాక్‌కు గురై చికిత్స పొందుతున్న కార్మికుడు మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల కింద హ్యాచరీస్‌కు చంద్రశేఖర్‌రెడ్డి(50) వెళ్లాడు. అదే సమయంలో లైట్లు పోవడంతో బాగుచేసేందుకు వైర్‌ను పట్టుకోగా అతడికి షాకొచ్చింది. తోటి కార్మికులు అతడిని హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్‌రెడ్డి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పదేళ్లుగా అతడు ఇక్కడే పనిచేస్తున్నాడు. అతడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిమజ్జన వేడుకల్లో ప్రమాదానికి గురైన వ్యక్తి...

కడ్తాల్: వినాయక నిమజ్జనోత్సవంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కడ్తాలకు చెందిన గోరటి రాములు(49) మృతిచెందాడని సీఐ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 20న రాత్రి శివాజీ కాలనీలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించారు. తిలకించేందుకు రాములు, అతడి భార్య సునీత, పిల్లలు మండపం వద్దకొచ్చారు. క్రేన్‌తో డ్రైవర్ గంగు నాయకుడు వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లోకి ఎత్తుతుండగా క్రేన్ ఇనుప కొండి తెగి షకలాలు రాములు, సునీతపై పడ్డాయి. రాములు తలకు, వెన్నుపూసకు, కాళ్లకు, సునీతకు గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. రాములుకు సర్జరీ అనంతరం రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాములు గురువారం మృతిచెందినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

విహారయాత్రలో విషాదం

● బోట్‌లో నుంచి పడి వ్యక్తి మృతి



మున్వర్(ఫైల్)

కడ్తాల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విహార యాత్రలో విషాదం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి బోట్‌లో ప్రయాణిస్తూ నీటిలో పడి మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల వివరాల మేరకు.. కడ్తాలకు చెందిన ఎండీ. మున్వర్ పాషా(38) మైసిగండికి చెందిన ఐదుగురు స్నేహితులో అక్టోబరు 30న నల్గొండ జిల్లా నేరేడుగొమ్మ మండలం వైజాగ్ కాలనీకి విహారయాత్రకు వెళ్లాడు. బోట్‌లో ప్రయాణిస్తుండగా పాషా జారి పడి గల్లంతయ్యాడు. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడి అచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం మున్వర్ మృతదేహం నీటిలో తేలింది. మున్వర్‌కు భార్య హసీనా, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పతికి తరలించారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్, నాయకులు చేగూరి వెంకటేశ్, ఎర్రోళ్ల రాఘవేందర్, శేఖర్‌గౌడ్, తులసీరామ్, జహాంగిర్‌బాబ, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, రవూఫ్, జావెద్ ఆస్పత్రి వద్ద పరామర్శించారు. మున్వర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కారు ఢీకొని బాలుడి దుర్మరణం

● కారు నడిపి ప్రమాదానికి కారకుడైన మైనర్

శంకర్‌పల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు కారు నడిపి నిండు ప్రాణాన్ని బలిగొన్నాడు. కారుతో బైక్‌ను ఢీకొట్టి బాలుడి మృతికి కారణమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గండిపేట మండలం నెక్నంపూర్‌నకు చెందిన సర్ఫ్‌రాజ్ శంకర్‌పల్లిలోని బీడీఎల్ చౌరస్తాలో పాన్‌డబ్బా నడుపుకుంటున్నాడు. గురువారం సర్ఫ్‌రాజ్, తన కుమారుడు గఫ్ఫార్ బైక్‌పై శంకర్‌పల్లి వచ్చారు. రాత్రి 11దాటిన తరువాత డబ్బా మూసి ఇంటికి బయల్దేరారు. మియాఖాన్‌గడ్డ చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండగా సర్ఫ్‌రాజ్ బైక్‌ను స్లోచేశాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన బాలుడి(16) కారు.. బైక్‌ను ఢీకొంది. దీంతో వెనక కూర్చున్న గఫ్ఫార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు, గాయాలైన సర్ఫ్‌రాజ్‌ను పోలీసులు నగరంలోని రెనోవా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి సైతం విషమంగానే ఉన్నట్లు తెలిపారు. ఎల్బీనగర్‌కు చెందిన ఓ బాలుడు తల్లికి చెప్పకుండా ఐదుగురు స్నేహితులతో కారులో షికారు కోసం వచ్చారు. కారు నడిపిన బాలుడిపై కేసు నమోదైంది. అతడిని శుక్రవారం ఎల్బీ నగర్‌లోని జువైనల్ కోర్టుకు తరలించామని మోకిల పోలీసులు పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

చౌదరిగూడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొందుర్గు శివారులో బైక్‌పై నుంచి పడి వెంకటేష్ అనే వ్యక్తి గాయపడ్డాడు. శుక్రవారం చౌడాపూర్ మండలం విఠలాపూర్‌నకు చెందిన వెంకటేష్ బైక్‌పై కొందుర్గు వైపు వస్తూ కస్తూర్బాగాంధీ పాఠశాల సమీపంలో అదుపు తప్పి పడి గాయపడ్డాడు. అతడిని స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం



ఖాజాబీ

కొత్తూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ నారాయణగూడ కాలనీకి చెందిన ఖాజాబీ(51) అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. పింఛన్ కోసం గత నెల 28న పోస్టాఫీస్‌కు వెళ్లిన మహిళ తిరిగి రాలేదన్నారు. ఖాజాబీ కోసం కుటుంబీకులు వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఖాజాబీ కుమారుడు సలాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అచూకీ తెలిసిన వారు 9440795743 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



ఆమనగల్లు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సొప్ప లారీ దగ్ధమైన ఘటన మేడిగడ్డ తండాలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లులో ఉండే మేడిగడ్డ మాజీ సర్పంచ్ గోపినాయక్ శంకర్‌కొండ తండాలో సొప్ప కొన్నాడు. దానికి లారీలో తరలిస్తుండ గా మేడిగడ్డతండా వద్ద ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు మీది నుం చి ఉన్న ఓ సర్వీసు వైర్ సొప్పకు తాకింది. షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిం ది. స్థానికులు, పోలీసులు చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చేలోపే సొప్ప, కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ హాని జరగలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొడిచర్లకు చెందిన రంగారెడ్డి అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. గ్రామానికి చెందిన దళితుడు దాసరి మోహన్ ప్రభుత్వం ఇచ్చిన భూమిలో చదునుచేస్తుండగా, రంగారెడ్డి వచ్చి దూషించడాని పేర్కొన్నారు. మోహన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ఇందిర-పటేల్ సేవలు చిరస్మరణీయం

షాద్‌నగర్ అర్బన్/షాబాద్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కేశంపేట చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో నివాళులర్పించారు. అలాగే వల్లబాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని పటేల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం కోసం ఎనలేని కృషిచేశారని తెలిపారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల అడుగుజాడల్లో యువత నడుచుకోవాలనిపిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు వై.యాదయ్య, విశ్వం, జి.బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, బస్వం, వన్నాడ ప్రకాష్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, రఘు, శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, సుదర్శన్‌గౌడ్, ముబారక్, రవి, అశోక్ పాల్గొన్నారు. ప్రతిఒక్కరు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని షాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. ఆమె చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఘనత ఇందిరమ్మదేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, నాయకులు జనార్దన్‌రెడ్డి, రవీందర్ నాయక్, ఆంజనేయులుగౌడ్, ఖుద్దూస్, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, సత్యం, సంజీవరెడ్డి, జానీ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మల్లేష్, జంగయ్య, రఫీక్ పాల్గొన్నారు.

కులగణన షురూ



చౌదరిగూడ: తుమ్మలపల్లిలో కుటుంబ సర్వే వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

చౌదరిగూడ/యాచారం/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/కేశంపేట/శంకర్‌పల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే ప్రారంభమైంది. శుక్రవారం చౌదరిగూడ మం డలం తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేస్తున్న ఇంటింటి సర్వేపై తహసీల్దార్ జగదశ్వర్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సౌజన్య, సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్ తిరుమల, ఆశా వర్కర్ సుభద్ర, ఎస్‌వో పవన్,గ్రామస్తులు రాంచంద్రయ్య, మాణిక్యారావు, శేఖర్, పెంటయ్య పాల్గొన్నారు. యాచారం మండలంలో కుల సర్వే పక్కాగా చేయాలని ఎన్యుమరేటర్ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి అన్నారు. గడ్డమల్లయ్యగూడ, యాచారం గ్రామాల్లో సర్వే స్టిక్కర్ల ను ఇళ్ల డోర్లకు అతికించారు. 6వ తేదీ నుంచి ఎన్యుమరేటర్ ఇళ్లకెళ్లి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమాల్లో ఎం పీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, సూపరింటెండెంట్ శైలజ పాల్గొన్నారు. ఆమనగల్లు మండల 13 పంచాయతీల్లో కుల గణన సర్వే ప్రారంభమైంది. ఎంపీడీవో పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, వీఓఏలు, పంచాయతీ సెక్రెటరీలు సర్వే చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ కల్లా కుటుంబాల వివరాలు సేకరిస్తామన్నారు. ఎంపీడీవో కుసుమమాధురి పోలెపల్లి, మేడిగడ్డతండా, చెన్నంపల్లిల్లో సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఏఎస్వోశివప్రసాద్ పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15 వార్డుల్లో కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. కడ్తాల్, తలకొండపల్లి మండలాల గ్రామాల్లో ఎంపీడీవోలు సుజాత, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. కేశంపేట మండలంలో కుటుంబాల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్యుమరేటర్లకు పర్వే మెటీరియల్ అందజేశారు. కొనాయపల్లి, కేశంపేట గ్రామాల్లో తహసీల్దార్ అజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సర్వేను పర్యవేక్షించారు. ఎంపీవో కిష్టయ్య, టీఏలు అజీజ్, నీలకంఠ బాబు పాల్గొన్నారు. కుటుంబ సర్వేలో ప్రజలు పూర్తి వివరాలివ్వాలని జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ రంగారావు తెలిపారు. చందిప్ప, ఎల్వర్తి గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. 16వ తేదీ కల్లా వివరాలను సేకరించి, 17-28 తేదీల్లోగా కంప్యూటీకరణ పూర్తి చేస్తామన్నారు. ప్రత్యేకాధికారి సురేష్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్ పాల్గొన్నారు.



యాచారం:గడ్డమల్లయ్యగూడలో కుటుంబ సర్వే చేస్తున్న అధికారులు



శంకర్‌పల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ రంగారావు



ఆమనగల్లు : మేడిగడ్డ తండాలో సర్వేలో ఎంపీడీవో కుసుమ మాధూరి

ఆనందోత్సాహాలతో దీపావళి



ఆమనగల్లు: దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-మాధవి దంపతులు

శంషాబాద్/కేశంపేట/మొయినాబాద్ రూరల్/షాద్‌నగర్/కందుకూరు/షాబాద్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/చేవెళ్ల/ఆదిబట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను గురువారం చిన్నాపెద్ద ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయమే ఆడ పడచులతో హారతులు తీసుకున్నారు. తీపి వంటకాలు ఆరగించారు. సాయంత్రం టపా కాయలు కాల్చారు. శంషాబాద్‌లోని మధురానగర్, ఆదర్శకాలనీ, ఆర్బీ నగర్, నక్షత్రకాలనీ, హెచ్.బృందావన్, రాళ్లగూడ, కాపుగడ్డ, నర్సింగ్‌ఇంద్రారెడ్డికాలనీ, ఎయిర్ పోర్టు కాలనీలో సంబరాలు అంబరాన్నంటాయి. కేశంపేట మండలంలో దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సాయం కాలం ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. నోములు, వ్రతాలు నోచుకున్నారు. దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే పండుగ అని మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్ అన్నారు. దీపావళిని షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దీపావళి పండుగను తన కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. కందుకూరు మండలంలో దీపావళి ప్రత్యేకపూజలు చేశారు. టపాసులు కాల్చారు. షాబాద్ మండల ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకున్నారు. దీపాలు, బొమ్మల కొలువులు, కేదారీశ్వర వ్రతాలు చేసుకున్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల గ్రామాల్లో దీపావళిని ఘనం గా జరుపుకున్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి-మాధవి దంపతులు పాల్గొన్నారు. తలకొండపల్లిలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి గ్రామాల్లో ఇండ్లు, దుకాణాల్లో బొమ్మల కొలువులు, లక్ష్మీపూజలు జరుపుకున్నారు. ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, మంచాల మాజీ జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డిల ఇంట్లో బొమ్మల కొలువు ఆకట్టుకుంది. యాదవ సంఘాల అధ్వర్యంలో గురువారం రాత్రి వరకు సదర్ సమ్మేళనాలు నిర్వహించారు. నాదర్‌గుల్‌లో తర్రె ఐలయ్యయాదవ్(96), సత్తెమ్మ(90) వేడుకలో పాల్గొన్నారు. మల్లేష్, ఆంజనేయులు, బిక్షపతి, పెంటయ్య, నాగరాజు పాల్గొన్నారు.



చేవెళ్లలో టపాకులు కాల్చుతున్న చిన్నారులు



షాబాద్‌లో దీపావళి సంబురాలు చేసుకుంటున్న కుటుంబం



కడ్తాల్ దీపావళి వేడుకల్లో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు

కల్తీమయం!

(5వ పేజీ తరువాయి)

అధికారులు తనిఖీలు నిర్వహించి, ప్రజలకు సురక్షిత ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ఉంది. జిల్లాలో హోటళ్ల సామర్థ్యం మేరకు ఫుడ్‌సేఫ్టీ అధికారులులేరు. ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారు. తనిఖీలు వారికి తలకుమించిన భారంగా మారింది. వినియోగదారులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండడం చచలేదు. మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి షాంపిళ్లను పరీక్షలకు పంపిస్తున్నారు.

కేవలం 70 నమూనాలే సేకరణ

తుక్కుగూడలోని ఎస్‌ఎన్ గ్రాండ్ హోటల్‌లో బిర్యానీలో సామర్థ్యానికి మించి సింథటిక్ రంగులు వాడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నమూనాలను పరీక్షించగా ఆ ఆహారం తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని నిర్ధారణైంది. దీంతో హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. మొయినాబాద్‌లోని భాస్కర మెడికల్ కాలేజీ క్యాంటీన్‌లో పురుగుల పప్పును వడ్డిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు పరీక్షించారు. జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు క్యాంటీన్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. కిస్మత్‌పూర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో బిర్యానీలో అధిక మోతాదులో సింథటిక్ కలర్స్ వాడారని తేలడంతో కేసు నమోదు చేయించారు. ఇలా జిల్లావ్యాప్తంగా పది నెలల్లో కేవలం 70 నమూనాలు సేకరించి పరీక్షించగా.. వీటిలో 17 నమూనాలు ప్రమాదకరంగా ఉన్నట్లు తేలింది. ఆయా హోటళ్లు, డెయిరీ ఫామ్‌లపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తున్నా కల్తీ వ్యాపారానికి అడ్డుకట్ట పడటం లేదలే విమర్శలు వస్తున్నాయి.

కాటేదాన్ కేంద్రంగా కల్తీ..

నగరంలోని కాటేదాన్ కేంద్రంగా మసాలా, అల్లంవెల్లుల్లి, ఐస్‌క్రీం పార్లర్లు, నెయ్యిప్యాకింగ్ తయారీ కేంద్రాల్లో కల్తీ పదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. అల్లంవెల్లుల్లిలో ఆలుగడ్డ కలుపుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో కుళ్లిన చికెన్, ఫిష్, మటన్‌లకు సింథటిక్ కలర్లు అద్ది, మసాలాలు దట్టించి, ఫ్రై చేసి విక్రయిస్తున్నారు.

'పాల'కూట విషం..

కల్తీపాల తయారీ భారీగా జరుగుతోంది. ప్రమాదకర చూరియా, సల్ఫర్ తదితర రసాయనాలతో కల్తీపాలు చేస్తున్నారు. కొందరు పాడి రైతులు అధిక పాల దిగుబడి కోసం పశువులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లతో సహా, బీర్ దాణా వంటి హానికర పదార్థాలు పెడుతున్నారు. ఇలా చేస్తే పశువుల ఆయుఃప్రమాణం తగ్గడంతో పాటు ఆ పాలు తాగే పిల్లల ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్నారు. ఇటీవల జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేవెళ్ల, నందిగామ, ఆల్మాస్‌గూడ, నాదర్‌గుల్, ముచ్చింతల, పసుమాముల్లోని డెయిరీల్లో తనిఖీలు నిర్వహించారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు పాల నాణ్యత లేదని తేలింది. ఆయా వ్యాపారులకు నోటీసులిచ్చారు. పాల డబ్బాలతో అమ్ముతున్న పాలల్లో సురక్షితం కాని నీళ్లను కలుపుతున్నారు.

అరకొర జరిమానాలు

ఆహార కల్తీ నిరోధక చట్టం కింద వివిధ రకాల ఉల్లంఘనలకు పాల్పడితే ప్రస్తుతం రూ.500-3,000 వరకు మాత్రమే జరిమానాలు విధిస్తుండటంతో ఉల్లంఘనులు వెరవడం లేదు. అపరిశుభ్ర పరిసరాల్లో వండిన వంటకాలనే వినియోగదారులకు వడ్డిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీల్లో అక్రమాలు బటయట పడితే తక్కువ మొత్తంలో జరిమానాలను చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

యాచారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యువకులు, విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని, మొబైల్ ఫోన్ యాప్‌లతో నష్టపోవద్దని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు అన్నారు. గురువారం రాత్రి ఆకులమైలారంలో కబ్బడ్డీ పోటీలను ప్రారంభించారు. మిత్రులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు మొబైల్ వాడాలని సూచించారు. గ్రామంలో జాతీయ స్థాయి క్రీడాకారులుండడం అభినందనీయమన్నారు. సైబర్‌నేరాలతో అమాయకుల డబ్బు పోతోందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొరిగె రాజు, శంకరి తిరుపతయ్య, రావుల జంగయ్య, అండెకార్ సురేష్, బండారి బీరప్ప, అచ్చన శ్రీనివాస్, రావులు సురేష్, క్రీడాకారాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల అందజేత

శంకర్‌పల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఉన్నవ్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం రోజున మహరాజ్‌పేట్ పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందజేశారు. దొంతాన్‌పల్లి, ప్రొద్దటూరు, టంగటూరు, గోపులారం, మహారాజ్‌పేట్, మోకిల గ్రామాల పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దత్తత తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు మాజీ సభ్యుడు బద్రి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చౌదరిగూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో సైబర్ క్రైంపై అవగహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాలపై ప్రజలు అవగహన కల్గిఉండాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం నేరం చేసిన వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమ్, చెడు వ్యసానాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. గ్రామంలో అపరిచితులు కన్పిస్తే 100 డయల్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ ఎస్‌ఐ విజయ్, హెచ్‌సీ నర్సింహులు, గ్రామస్తులు రాములు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం

మాడ్గుల: ప్రజా మస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్ అన్నారు. మాడ్గులలో గురువారం రాత్రి సీపీఎం గ్రామ మహాసభలు నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో కార్మికులు, కూలీలు, రైతులు, మహిళల సమస్యలపై సీపీఎం పోరాడుతోందన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు,ఇళ్ల మంజూరు చేయాలన్నారు. నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా కట్ట అంజయ్యను ఎన్నుకున్నారు. మండల కన్వీనర్ ఫులికంటి రమేష్, కాటంగౌడ్, చిన్నకృష్ణయ్య, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం వెల్జాల పంచాయతీ పారిశుధ్య కార్మికుడు నర్సింహ మృతిచెందాడు. మృతదేహానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేలు అందజేశారు. అలాగే మాజీ ఉపసర్పంచ్ అజీజ్ రూ.2వేలు, మాజీ ఎంపీటీసీ అంబాజీ, రూ.వెయ్యి, ఎండీ అబ్బాస్ రూ.వెయ్యి అందజేశారు.

దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

కడ్తాల్: కడ్తాలలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట నిర్మించిన దుకాణాల కేటాయింపునకు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య టెండర్లు నిర్వహిస్తోంది. 2022లో రూ.48.51లక్షలతో దుకాణ సముదాయం నిర్మించారు. పది దుకాణాలను కేటాయింపునకు టీజీడీడీసీఎఫ్ ప్రకటన జారీ చేసింది. నవంబరు 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డిప్యూటీ డైరెక్టర్ శివాల్కర్‌యాదవ్ ప్రకటించారు. ఫారాలు పాలశీతలీకరణ కేంద్రంలో ఉంటాయన్నారు. ఫారానికి రూ.1,500, ఈఎండీ రూ.20వేలు డిమాండ్ డ్రాఫ్ట్, టీజీడీడీసీఎఫ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పేరిట తీసి అందజేయాలని పేర్కొన్నారు.

ఎంపీని కలసిన కాంగ్రెస్ నాయకుడు

మాడ్గుల: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని హైదరబాద్‌లోని నివాసంలో రాష్ట్రయువజన కాంగ్రెస్ నాయకుడు రమేష్‌గౌడ్ కలసి సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బ్రాహ్మణపల్లి నుంచి మాడ్గుల వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని, బ్రాహ్మణపల్లి నుంచి నల్గొండ జిల్లా కుర్మేడ్ వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరానని ఆయన చెప్పారు.

కాస్మొటిక్ చార్జీల పెంపు హర్షణీయం

చేవెళ్ల: ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడం హర్షణీయని విద్యార్థులన్నారు. చేవెళ్ల మోడల్ కాలనీలో కొనసాగుతున్న గుకులు (మియాపూర్), ధర్మసాగర్ బీసీ గురుకులు(నవాబ్‌పేట్), సాగర్ కళాశాల(బురాన్‌పూర్)లో కొనసాగుతున్న పూలే బీసీ పాఠశాల, కళాశాల విద్యార్థులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాస్మొటిక్స్, చార్జీలు పెంచడంపై సంతోషంగా ఉందని విద్యార్థులు అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ నర్సింలు, రవీందర్, సుష్మ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

సంబరాలు చేసుకున్న బాలికలు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి చెరపటేల్‌గూడలోని ఖైరతాబాద్, చంద్రాయన్‌గుట్ట మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో బాలికలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కొన్నేళ్లుగా డైట్ చార్జీలు సరిపోక సరైన పౌష్టికాహాన్ని పొందక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం తమకు ఆనందాన్ని కలిగిస్తోందని బాలికలన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, టీచర్లు పాల్గొన్నారు.

మొదటి ప్లీనరీని విజయవంతం చేయాలి

కేశంపేట: ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే మొదటి ప్లీనరీని విజయవంతం చేయాలని కేశంపేట పార్టీ మండల కన్వీనర్ మహిపాల్ పిలుపునిచ్చారు. 3న ఆదిబట్లలో నిర్వహించే ప్లీనరి కరపత్రాన్ని కేశంపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లేష్, శివ, రవి, శ్రీకాంత్, నరసింహ, కృష్ణ, నందు, విష్ణు, రమేష్, కుమార్, జానీ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

యాచారం: గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. నానక్‌నగర్‌లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఆటోలు, బైక్‌లు తనిఖీ చేశారు.